అడ్మిషన్.. టెన్షన్

- డిగ్రీ ప్రవేశాలపై ప్రభుత్వం మీనవేషాలు
- ఇప్పటికీ విడుదల కాని నోటిఫికేషన్
- విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా రాని స్పష్టత
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అడ్మిషన్లపై గందరగోళం

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో మొదటి సంవత్సరం రిజిష్టర్ చేసుకున్న విద్యార్థులు	
ఉరవకొండ	260
కళ్యాణదుర్గం	450
రాయదుర్గం	450


ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యకు నిర్లక్ష్యం చేస్తోంది.. విద్యార్థుల్లోనూ గందరగోళం నెలకొంది. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు జరగలేదంటే .. ప్రభుత్వం విద్యకు ఏమాత్రం ప్రాధాన్యత ఇస్తోందో ఇట్టే అర్థమవుతుంది. నేటికీ నోటిఫికేషన్ విడుదల కాక విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొంది.

అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో ఆందోళన

ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 3 ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 3,800 డిగ్రీ మొదటి సంవత్సరంలో జాయిన్ అయ్యారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ విధానాలతో ఇప్పటి వరకు నోటిఫికేషన్ విడుదల కాలేదు. డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు చాలా మంది గత్యంతరం లేక ఇప్పటికే పాలిటెక్నిక్‌తో పాటు ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో పాటు అధ్యాపకులు డిగ్రీ కళాశాలలో మీ పిల్లలను చేర్పించండి అంటూ ప్రచారం చేస్తున్నా ఎలాంటి స్పందనా లేదు.

జూలైనెలలోనే అడ్మిషన్లు పూర్తి కావాల్సి ఉంది...

ఇంటర్ ఫలితాలు విడుదలై దాదాపు మూడు నెలలు దాటినా నేటికీ డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం.. ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సాధారణంగా జూలై మాసానికి అడ్మిషన్ల పక్రియ ప్రారంభమై తరగతులు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఇంత వరకూ ఆ ఊసే లేకుండా పోయింది. దీంతో వేలాది మంది విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది. సరైన ప్రణాళిక లేకుండా విద్యా వ్యవస్థలో కూటమి ప్రభుత్వం గందరగోళం సృష్టించి విద్యార్థులను ఇబ్బంది పాలు చేస్తోంది.

వీడని సందిగ్ధత:

డిగ్రీ కోర్సులకు సంబంధించి సింగిల్, డబుల్ మేజర్ సబ్జెక్టులపై సందిగ్ధత ఉంది. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను అందుబాటులో తెచ్చింది. అలాగే సింగిల్, డబుల్ మేజర్ సబ్జెక్టులతో నూతన డిగ్రీ కోర్సులను అందిస్తున్నారు. అయితే వీటిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ విధానాలతో విద్యార్థులు, అధ్యాపకులు గందరగోళానికి గురయ్యారు. దీని ప్రభావంతో రేడాది అడ్మిషన్లు 20 శాతం కుడా జరిగేలా కనిపించలేదు.

విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం



డిగ్రీ అడ్మిషన్లపై నేటి వరకూ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణం. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. డిగ్రీ అడ్మిషన్లపై ప్రభుత్వ వైఖరి స్పష్టత చేయాలి. ఇతర రాష్ట్రాల్లో డిగ్రీ అడ్మిషన్లు పూర్తయ్యి తరగతులు కూడా ప్రారంభమవుతున్నా.. ఆంధ్రప్రదేశ్‌లో విద్యాశాఖ మంత్రి లోకేష్ అనాలోచిత నిర్ణయాలతో విద్యావ్యవస్థ భ్రష్టుపడుతోంది.

– నవీన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉరవకొండ

నోటిఫికేషన్ రాగానే అడ్మిషన్లు ప్రారంభిస్తాం



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల కాగానే వెంటనే అడ్మిషన్ల పక్రియ ప్రారంభిస్తాం. విద్యాసంవత్సరం ఇప్పటికే ఆలస్యమైంది. విద్యార్థులకు సమాధానం చెప్పలేకపోతున్నాం. ఇప్పటికే 260 మంది విద్యార్థుల పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం.

– ఆదినారాయణ, ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల, ఉరవకొండ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

గుమ్మఘట్ట: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నెలలు గడుస్తున్నా సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొల్ల రామాంజనేయులు, వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు దిలావర్ బాషా విమర్శించారు. రాయదుర్గం మండలంలోని నాగిరెడ్డిపల్లి, కదరంపల్లి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఏడాది పాలన తర్వాత అమలు చేస్తున్న అరకొర పథకాలు కూడా ప్రజలకు వర్తించలేదని, అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. తల్లికి వందనం, ఇంటింటికీ ఉచిత గ్యాస్ తదితర పథకాలు కూడా పూర్తిగా వర్తించలేదని, పథకాల అమలులోనూ కొర్రీలు పెడుతుండడంతో అర్హులందరూ పథకాలకు నోచుకోలేదన్నారు. అధికార దాహం కోసం చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు, విలేజ్ హెల్త్ సెంటర్లను నిర్మించి, గ్రామాలను అభివృద్ధి పథకంలో నడిపించారని గుర్తు చేశారు. ఇంటిముంగిటకే పథకాలు అందించేవారని, ఏ ఒక్కరూ పథకాలు అందలేదన్నవారు లేరన్నారు. కూటమి నాయకులు దోచుకుని దాచుకోవడానికి ఇచ్చిన ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప..ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, మాజీ సర్పంచ్ బొజ్జప్ప, రాఘవేంద్రరెడ్డి, ముక్కన్న, కురుబ తిప్పేస్వామి, బసవరాజు, మురారి, బీఎన్ హళ్లి తిప్పేస్వామి, రామాంజిని, లక్ష్మన్న, వెంకటేశ్‌నాయక్, రుద్రముని, నాగేష్, గోపాల్ ,బొమ్మక్కపల్లిచంద్ర, గొల్లపల్లి, తిప్పేస్వామి, కిష్టప్ప, మద్దాని, మంజునాథ, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.


నాగిరెడ్డిపల్లిలో సంక్షేమ పథకాలపై ప్రజలతో ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


కంబదూరు మండలం ములుకనూరులో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నయవంచనపై ప్రతి ఇంటా తెలియజేద్దాం

కళ్యాణదుర్గం రూరల్: కూటమి నయవంచన పాలనపై ప్రతి ఇంటా తెలియజేద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి పిలుపునిచ్చారు. సోమవారం కళ్యాణదుర్గం మండల పరిధిలోని గరుడాపురం, బోయలపల్లి, కంబదూరు మండలంలోని ములకనూరు, చెన్నంపల్లి గ్రామాల్లో మండల కన్వీనర్లు గోళ్ల సూరి, వెంకటప్ప హనుమంతురాయుడు ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో కలసికట్టుగా పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. అధికారం కోసం అమలుకాని హామీలు ఇచ్చి.. అధికారంలోకొచ్చిన తర్వాత నయవంచన చేస్తున్నారని, కూటమి నేతల నిజస్వరూపం ప్రజలకు తెలియజేద్దామన్నారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, పట్టణ కన్వీనర్ సుదీర్, జిల్లా కోర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ భర్త హనుమంతురాయుడు, నాయకులు మల్లాపురం మల్లి, అశోక్‌రెడ్డి, దొడగట్ట మురళి, బీమేష్, బొజప్ప, బోరంపల్లి రామిరెడ్డి, అమర్, గోవిందరాజులు, అనిల్, ప్రసాద్, రవి, మల్లారెడ్డి, నరేంద్ర, వెంకటేశులు, పాత లింగ, వన్నూరస్వామి, హనుమంతురాయుడు, కామక్కపల్లి మల్లికార్జున, నాగేంద్ర, నరేంద్రరెడ్డి, పాతన్న, శ్రీధర్, ఈశ్వర్, రామాంజనేయులు, కిష్ట, వెంకటేశులు, కురువ హనుమంతురాయుడు, బాబూజీ, ఓబులేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


కణేకల్లు క్రాస్‌లో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ పథకాలు అందడంలేదు'

కణేకల్లు: కూటమి పాలనలో సంక్షేమ పథకాలు అందడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని కణేకల్లుక్రాస్‌లో 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉషారాణి, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, స్థానిక నాయకులు ఆలూరు చిక్కణ్ణ, రవీంద్రారెడ్డి, ప్రతాప్, ఉదయ్, గోవిందరాజులు ఇంటింటా వెళ్లి 'ఆడబిడ్డ నిధి, '50 ఏళ్ల పింఛన్', 'నిరుద్యోగ భృతి' 'డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు' తదితర పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అలాంటి పథకాలేవీ అందడంలేదని మహిళలు నాయకుల దృష్టికి తెచ్చారు. కూటమి నేతలు చెప్పిన హామీలను నమ్మి ఓట్లు వేసి మోసపోయామని చెప్పారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు సక్రమంగా అర్హులందరికీ అందేవన్నారు. కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నేతలు ఆర్కే బద్రీ, కురుబ తేజ, గోపులాపురం కృష్ణారెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, యర్రగుంట హనుమంతు, గోవర్ధన్‌రెడ్డి, చిన్న సర్మస్, చిక్కణ్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డలకు శ్రీరామరక్ష


బెళుగుప్పలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బొమ్మనహాళ్: తల్లిపాలే చంటి పిల్లలకు శ్రీరామరక్ష అని తహసీల్దార్ మునివేలు, ఎంఈఓ మల్లికార్జున అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తిరుపాల్ బాయ్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: తల్లి పాలే బిడ్డలకు శ్రీరామరక్ష అని సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఆర్‌డీఓ వసంత్‌బాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ వసంత్‌బాబు, సీడీపీఓ లక్ష్మీప్రసన్న అధికారులతో కలిసి తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్లు విడుదల చేశారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఆర్‌డీఓ వసంత్‌బాబు మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమన్నారు.కార్యక్రమంలో రాయదుర్గం, కణేకల్లు, కంబదూరు మండలాల అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చంటి బిడ్డకు ముర్రుపాలు మొదటి టీకా

బెళుగుప్ప: అప్పుడే పుట్టిన బిడ్డకు అరగంటలోపే పాలు తాపించాలని, ముర్రుపాలు మొదటి టీకాలా పనిచేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మూడో నంబర్ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్‌లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


బొమ్మనహాళ్‌లో తల్లిపాలపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ మునివేలు తదితరులు

రాజ్యాంగంపై అవగాహన అవసరం


మాళాపురంలో రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విడపనకల్లు: ప్రతి భారతీయుడికి భారత రాజ్యాంగంపై అవగాహన ఉండాలని గుంతకల్లు రెవెన్యూ డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు హరిప్రసాద్‌యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని మాళాపురం కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల, మోడల్ స్కూలులో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులిసి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇక నుంచి పరీక్షలకు ఆన్సర్ బుక్‌లెట్


ఎంఆర్‌సీకి సరఫరా చేసిన ఆన్సర్ బుక్‌లెట్లు

రాయదుర్గంటౌన్: ఇక నుంచి పరీక్షలకు ఆన్సర్ బుక్ లెట్ ఉపయోగించనున్నారు. సబ్జెక్టుల వారీగా ఆన్సర్ బుక్‌లెట్లను ప్రభుత్వం మండలాల వారీగా ఎమ్మార్సీలకు సరఫరా చేసింది. పరీక్షల సమయంలో ఏ4, లీగల్ పేపర్లలో విద్యార్థులు పరీక్షలు రాసే వారు. అవసరమైన పక్షంలో అదనపు పేపర్ల కోసం ఇబ్బందులు పడేవారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులందరికీ ఎఫ్ఏ1, ఎఫ్ఏ 2, ఎఫ్ఏ 3, ఎఫ్ఏ 4, ఎస్ఏ 1, ఎస్ఏ 2 పరీక్షలకు సంబంధించి అన్ని టైటిల్ ఎగ్జామ్స్‌కు ఆన్సర్ బుక్ లెట్లు సరఫరా చేసినట్లు ఎంఈఓ-2 వెంకట రమేష్ తెలిపారు. రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని 78 ప్రభుత్వ పాఠశాలల్లో 14,472 మంది విద్యార్థులు చదువుతున్నట్లు చెప్పారు.

సీఐ జయానాయక్‌కు సన్మానం


సీఐ జయనాయక్‌ను సత్కరించిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంఅర్బన్ సీఐ జయానాయక్‌ను ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం సన్మానించారు. ఇటీవల రాయదుర్గం బాధితుడి ఫిర్యాదుతో కాంబోడియా దేశం నుంచి సైబర్ వల వేసి క్రిప్టో కరెన్సీ సరిహద్దు దాటే యత్నాన్ని స్థానిక పోలీసులు భగ్నం చేశారు. సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. సోమవారం అర్బన్ సీఐ జయానాయక్‌ను తన కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు కొట్రేష్, బంగి శివ, కుమార్, నాగయ్య, గౌతమ్, రాజు, మనోజ్ సన్మానించారు.

తాగునీటి సమస్య పరిష్కారం


పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: మహిళల ఆందోళనకు స్పందించిన మున్సిపల్ అధికారులకు ఎట్టకేలకు 30వ వార్డు ఆధ్యాత్మిక ప్రచార సేవాశ్రమం వీధిలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. ఈ వీధిలో 20 కుటుంబాలకు తాగునీటి సరఫరా జరగలేదు. కొళాయిలకు నీరు వచ్చినప్పుడు కేవలం నాలుగైదు బిందెలు మాత్రమే వస్తున్నాయని, దాదాపు ఏడాదిగా సమస్యను పట్టించుకోకపోవడంతో ఇటీవల ఖాళీ బిందెలతో బళ్లారి రోడ్డుపై ధర్నా చేసి, నిరసన తెలిపారు. స్పందించిన అధికారులు ఆధ్యాత్మిక ప్రచార సేవాశ్రమం వద్ద నుంచి ప్రధాన రహదారి వద్ద గల పంపింగ్ పైప్‌లైన్‌కు నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు.

ఆర్‌ఎస్కే కిటికీ అద్దాలు ధ్వంసం


ధ్వంసమైన కిటికీల అద్దాలు

ఉరవకొండ రూరల్: మండలంలోని వెలిగొండలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్‌ఎస్కే భవనం నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనంలో రైతులకు సేవలు కొనసాగుతున్నాయి. కానీ ఆకతాయిలు ఆర్‌ఎస్కే భవనం చుట్టూ ఉన్న కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. రైతులకు అందించేందుకు విత్తనాలు, ఎరువులు నిల్వ చేసేందుకు వీలు కావడం లేదు. వర్షం వస్తే కిటకీల నుంచి వర్షపునీరు భవనంలోకి చేరుతోంది. దీంతో విత్తనాలు, ఎరువులు తడిసిపోతున్నాయి.

మొబైళ్లను వెనక్కిచ్చేసిన అంగన్‌వాడీలు


మొబైల్ ఫోన్లను ఐసీడీఎస్ సిబ్బందికి తిరిగి అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయదుర్గంటౌన్: మొబైళ్ల నెట్ వర్క్ పనిచేయడంలేదని, యాప్‌లతో అవస్థలు పడలేమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మొబైళ్లను ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందమ్మ, మేరీ ఆధ్వర్యంలో మొబైళ్లను ఐసీడీఎస్ సిబ్బందికి అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మొబైళ్లలో సక్రమంగా నెట్‌వర్క్ లేక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర కమిటీ నిర్ణయంతో మొబైల్ ఫోన్లను తిరిగి ఇస్తున్నట్లు చెప్పారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ కమల నాగరాజు

కుందుర్పి : ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఓబులేసును ఎంపీపీ కమల కోరారు. సోమవారం ఎంపీపీ కమల ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఓబులేసును మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి, సన్మానం చేశారు. మండలంలో రైతులు, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బ్రహ్మసముద్రం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన మంగళవా రం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీటీసీలు, సర్పంచులు , కో ఆప్షన్ సభ్యు లు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కా వా లని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

కూడేరు: కూడేరుకు చెందిన ఆటో డ్రైవర్ నాగేంద్రనాయక్ (32) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. నాగేంద్రనాయక్ గతనెల 29న కమ్మూరు వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

మోటారు కేబుల్ అపహరణ

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడిలో రైతు నరిగన్నకు చెందిన వ్యవసాయ బోరుబావి మోటారు కేబుల్ గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. బోరుబావికి అమర్చేందుకు ఇంటి వద్ద ఉంచిన కేబుల్‌ను గుర్తు తెలియని వారు ఎత్తుకెళ్లారని సుమారు 200 మీటర్ల కేబుల్ రూ.40వేల విలువ చేస్తుందన్నారు. గతంలోనూ 200 మీటర్ల హెచ్‌డీ పైపు చోరీకి గురైందన్నారు.

రాజకీయ కక్ష సాధింపుతోనే మిథున్‌రెడ్డి అరెస్టు


తిరుపతిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: రాజంపేట ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డిని కేవలం రాజకీయ కక్ష సాధింపుతోనే అరెస్టు చేశారని కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య అన్నారు. సోమవారం తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రంగయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని రంగయ్య అన్నారు. అనంతరం కళ్యాణదుర్గం నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు.

నిరవధిక సమ్మెలోకి కార్మికులు


ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో స్వచ్ఛభారత్ కింద ఇంటింటా చెత్త సేకరించే కార్మికులు జీతాలు పెంచాలని పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ధర్నాను ఉద్దేశించి స్వచ్ఛభారత్ యూనియన్ నాయకులు వాలి, మంగమ్మ మాట్లాడారు. ఏడేళ్ల నుంచి కేవలం రూ.6వేల వేతనంతో పని చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇంటి అద్దె, నిత్యావసర ధరలు పెరిగాయని, కుటుంబ పోషణ భారంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి వేతనం రూ.21 వేలకు పెంచాలని ,కొబ్బరినూనె, సబ్బులు, యునిఫామ్ అందించాలని కోరారు. అనంతరం ఈఓ గౌస్‌సాహెబ్‌కు సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పలకుంట గ్రామస్తులు వర్షం కోసం సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్రాయికి 101 బిందెల నీటితో అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు.

జంబుకేశ్వరుడికి విశేష పూజలు


ప్రత్యేక పూల అలంకరణలో జంబుకేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: స్థానిక కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. అర్చ కులు రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు విశేష పూల అలంకరణ చేశారు. పంచామృతాభిషేకం , ఏకబిల రుద్రాభిషేకం, కుంకుమార్చన చేశారు.

సంగమేశ్వరాలయంలో పూజలు


కూడేరు: అలంకరణలో స్వయంభు జోడు లింగాలు

కూడేరు:కూడేరు సంగమేశ్వర ఆలయంలో సోమవారం శివనామస్మరణ మార్మోగింది. స్వయంభు జోడు లింగాల దర్శనార్థం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. పార్వతీపరమేశ్వరుడికి పూజలు చేయించి, మొక్కులు తీర్చుకున్నారు. పాలాభిషేకం, రుద్రాభిషేకం పూజలు అర్చకుడు శివశంకర శాస్త్రి, మహేష్, ప్రవీణ్ స్వాములు నిర్వహించారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం అన్నదానం చేసింది.

ఈపంట నమోదుపై సమీక్ష


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

బెళుగుప్ప: మండలంలో ప్రస్తుతం వరకు విత్తన సాగు చేపట్టిన రైతులు తప్పకుండా ఈపంట నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఎంఏఓ పృథ్వీసాగర్‌తో కలిసి ఈ పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ తదితర అంశాలపై వ్యవసాయ, రెవెన్యూ గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులు ఇచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ ఈక్రాప్ నమోదు చేయాలని ఆదేశించారు. కౌలు రైతు పత్రాలను అర్హులకు మంజూరు చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ మధు, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హర్షలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయని, పీజీ కంప్యూటర్ సైన్స్, కామర్స్ సబ్జెక్టుల్లో 55 శాతంతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఈనెల 7లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 11న ఇంటర్వ్యూ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.